రైస్.. రైట్..



ఖమ్మంలోని ఓ పాత రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 600 బస్తాల రేషన్‌బియ్యం

పేదల బియ్యం పక్కదారి

- జిల్లాలో జోరుగా రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారం
- కాకినాడ పోర్టులో తనిఖీలు.. ఖమ్మంలోనే నిల్వలు
- అనుకూల సమయం కోసం వ్యాపారుల నిరీక్షణ
- తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు, అధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం అందిస్తున్న రేషన్ బియ్యం వారి ఆకలి తీర్చుతుందో లేదో కానీ, పెద్దల జేబులు మాత్రం నింపుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఎన్ని నిర్బంధాలు విధించినా రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారం జోరు తగ్గడం లేదు.



కారేపల్లిలో పట్టుకున్న రేషన్‌బియ్యం వాహనాలు

ఖమ్మం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):. రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి వచ్చే రేషన్‌బియ్యం లారీలు ఖమ్మం మీదుగా కాకినాడ పోర్టుకు తరలుతుండగా అక్కడి నుంచి బియ్యాన్ని బడా వ్యాపారులు ఇతర దేశాలకు తరలిస్తున్నారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం కాకినాడతో పాటు బందరు, విశాఖ పోర్టుల్లో రేషన్‌బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచి తనిఖీలు ముమ్మరం చేసింది. గోదాంలను సీజ్ చేసి కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తోంది. దీంతో తెలంగాణలోని రేషన్ బియ్యం వ్యాపారులు పరిస్థితిని గ్రహించి ఎక్కడి బియ్యం అక్కడే నిల్వ చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బియ్యం వ్యాపారులు కూడా గప్‌చిప్‌గా రేషన్ బియ్యాన్ని దాచేశారు. బియ్యం తరలింపునకు సానుకూల వాతావరణం ఏర్పడితే వాటిని బయటకు తీయాలని చూస్తున్నారు.

ఇటీవల వరుసగా పోలీసు, టాస్క్‌ఫోర్స్ బృందాలు, సివిల్ సప్లయాస్, విజిలెన్స్ బృందాలు చేస్తున్న దాడుల్లో రేషన్‌బియ్యం రోజుకోచోట వెలుగులోకి వస్తోంది. మంగళవారం ఖమ్మం సమీపంలోని పాండురంగాపురం ప్రాంతంలో మూతబడి ఉన్న పాత రైస్‌మిల్లులో సుమారు 300క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నారు. కాకినాడకు వెళ్లే అవకాశం లేక ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన రేషన్‌బియ్యం ఇక్కడ నిల్వ ఉంచారు. మూడు రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లానుంచి వస్తున్న రేషన్‌బియ్యం లారీని కారేపల్లి పోలీసులు పట్టుకున్నారు. (మిగతా 6వ పేజీలో)

అదిగో భద్రాద్రి..



ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన భద్రాచలం రామాలయం

దేదీప్యమానం భద్రాద్రి క్షేత్రం

- ముక్కోటిలో భాగంగా నేడు రామయ్య జలవిహారం
- గోదావరిలో తెప్పోత్సవానికి పూర్తయిన ఏర్పాట్లు
- రేపు వైకుంఠ ఏకాదశి వేళ ఉత్తర ద్వార దర్శనం
- స్వామి వారిని వీక్షించేందుకు 8 సెక్టార్ల ఏర్పాటు
- భద్రాచలం తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు
- పట్టణమంతా పరిమళిస్తున్న ఆధ్యాత్మిక సౌరభం
- 1200 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఏఎస్పీ

భద్రాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా స్వాగత ద్వారాలు... చాందినీ వస్త్ర అలంకరణలు... విద్యుత్ దీపాలంకరణలతో ప్రకాశిస్తున్న రామాలయం పరిసరాలు.. 'శ్రీరామ జయ రామ.. జయ జయ రామ' అంటూ భక్తుల రామనామ స్మరణలు.. శ్రీ రామ నామమే స్మరించు హృదయాల సాక్షిగా.. భద్రాచలం కలియుగ వైకుంఠంగా దర్శనమిస్తోంది. ప్రసిద్ధ భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అధ్యయనోత్సవాలు రూ.1.20 కోట్లతో నిర్వహిస్తున్నారు. డిసెంబరు 31 నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభం కాగా తొలి పది రోజులుగా పగల్‌పత్తు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో స్వామి వారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం శ్రీసీతారామచంద్ర స్వామి శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం తిరుమంగై ఆళ్వారు పరమపదోత్సవం నిర్వహించనున్నారు. ఇక సాయంత్రం నిర్వహించే రామయ్య తెప్పోత్సవానికి గోదావరి నదీ తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో పగల్‌పత్తు ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. హంసాలంకృత లాంచీపై జగదభిరాముని జలవిహారం సాగనుంది. కనులపండువగా సాగే శ్రీ సీతారామచంద్రస్వామి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వారంలో శ్రీ సీతారామచంద్రస్వామి మహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీంతో దేవస్థానం, రెవెన్యూ, నీటిపారుదల శాఖ, గ్రామపంచాయతీ, తదితర శాఖలు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు నిర్వహించగా పోలీసు శాఖ బందోబస్తుపై దృష్టి సారించింది. ముక్కోటిని పురస్కరించుకొని భక్తుల కోసం దేవస్థానం ఆధ్వర్యంలో రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేసింది.

ఉత్తరద్వార దర్శనం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారంలో స్వామి వారుభక్తులకు దర్శనమివ్వనుండటంతో అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందుకు ఎనిమిది సెక్టార్లను ఏర్పాటు చేశారు. ఇందులో వీవీఐపీ, వీఐపీ, ఏ,బీ,సీ,డీ,ఈ సెక్టార్లతో పాటు ప్రెస్ సెక్టార్‌లో 3,800 మంది కూర్చొని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. (మిగతా 6వ పేజీలో)



గోదావరి నదీ తీరంలో పర్యాటకుల డేరాలు

ఏరు పండుగకు సర్వం సిద్ధం

- ముక్కోటి భక్తులకు పర్యాటక విందు
- మూడు రోజుల ప్యాకేజీలో రెండు రాత్రులు గోదావరి తీరంలో బస
- పెద్దలకు రూ.6 వేలు, పిల్లలకు రూ.4 వేలు
- నదీ తీరంలో 50 స్టాల్స్ ఏర్పాటు

6

రివర్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు పూర్తి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

6

'ముక్కోటి ఏకాదశి' అంటే..

- శ్రీమన్నారాయణుడిని సేవించుకునే పర్వదినం

6

నేడు మంత్రి తుమ్మల రాక

మూడు రోజుల పాటు పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10గంటలకు టేకులపల్లి 7వ డివిజన్‌లో డైట్ కళాశాల అదనపు భవనాలకు శంకుస్థాపన చేస్తారు. 11:30కి తల్లాడ మండలం నూతన్‌కల్‌లో కో ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారు. శుక్రవారం ఉదయం 9:30కి సత్తుపల్లి మండలం బుగ్గపాడులో నాగుపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కాకర్లపల్లిలో ఉదయం 10గంటలకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. అక్కడే కో ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని మంత్రి తుమ్మల ప్రారంభిస్తారు. 10:30కి సత్తుపల్లిలో సింగరేణి అగ్రికల్చర్ గోదాముకు శంకుస్థాపన చేస్తారు. 11:30కి రామ గోవిందాపురంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. శనివారం ఉదయం దమ్మపేట మండలం కట్కూరులో రాచన్నగూడెం కుసుకుంట్ల హైలెవల్ వంతెనకు శంకుస్థాపన చేస్తారు. 11గంటలకు పుసుకుంటలో ఆయిల్‌పాం ప్లాంటేషన్‌లో పాల్గొని రైతులతో సంభాషిస్తారు.

ఆధునిక వైద్య సేవలు అందేలా చూడండి

- ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో పడకలను 575కు పెంచండి
- సంక్రాంతి తర్వాత మెడికల్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన
- నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహాతో భేటీ



వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ, హెల్త్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణితో మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు మెరుగుపరచాలని, ఖమ్మం జిల్లా ఆసుపత్రిని 575 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తిచేశారు. హైదరాబాదులో బుధవారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణితో కలిసి ఖమ్మం మెడికల్ కళాశాల పనులు, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, స్థితిగతులపైనా తుమ్మల సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లాలో ఆసుపత్రుల సమస్యలను వైద్యారోగ్యశాఖ మంత్రి దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలుండేలా ప్రత్యేక చొరవ చూపాలని ఇందుకు అవసరమైన వైద్య పరికరాలను అందజేయాలని కోరారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో 500 పడకలు సేవలు అందుబాటులో ఉండేవని, కరోన సమయంలో420పడకలకు తగ్గించారని, ఇప్పుడు 575కు పడకలు పెంచాలని కోరారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపించామని తెలిపారు. జిల్లాలో కల్లూరు, సత్తుపల్లి, ఆసుపత్రుల్లో కూడా అదనపు హంగులు ఏర్పాటు చేయాలని, రోగులకు మందులు కూడా అందించాలని సూచించారు. ఖాళీ పోస్టులను భర్తీచేయాలని, సూచించారు.

ఖమ్మం ఆసుపత్రిలో పలు విభాగాలకు సంబంధించి సిబ్బంది కొరత ఉందని, వైద్యపరీక్షల నిర్వాహణకు టెక్నీషియన్లు ప్రతి నిమిషం అందుబాటులో ఉండేలా చూడాలని, ఆసుపత్రుల్లో ఏ పరికరాలు కావాలన్నా వెంటనే ఏర్పాటు చేసుకునేలా చూడాలని సూచించారు. నూతన అంబులెన్సులతోపాటు 104,108 వాహనాలను కూడా అందుబాటులో ఉంచాలనిసూచించారు. కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్తవాటిని మంజూరుచేయాలని కోరారు. కాగా సంక్రాంతి తర్వాత ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నందున శంకుస్థాపన ఏర్పాట్లను వైద్యాశాఖ అధికారులు చేపట్టాలని కోరారు. ఖమ్మం మెడికల్ కళాశాల నిర్మాణం అద్భుతంగా, అత్యాధునికంగా ఉండాలని కోరారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటుచేయాలని మంత్రి తుమ్మల కోరగా, పరిశీలించి అనుమతిస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి తెలిపారు.



అదనపు కలెక్టర్‌కు గుండెపోటు

- ప్రైవేటు ఆస్పత్రిలో స్టెంట్ వేసిన వైద్యులు
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలింపు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డికి గుండెపోటు వచ్చింది. మంగళవారం విధినిర్వహణ అనంతరం ఇంటికి వచ్చిన తర్వాత రాత్రి పది గంటల సమయంలో ఛాతీలో తీవ్రమైన నొప్పిరావడంతో (మిగతా 6వ పేజీలో)

అన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు..

- మద్యం మత్తులో తమ్ముడి ఘాతుకం
- 30 శాతం కాలిన గాయాలతో పరిస్థితి విషమం
- వరంగల్ ఎంజీఎంకు బాధితుడి తరలింపు



ఖమ్మం క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న అన్నపై మద్యం మత్తులో సొంత తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. కుటుంబ సభ్యులు, ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నిజాంపేటకు చెందిన గోనెల స్టాలిన్, గోనెల భానుప్రసాద్, గోనెల రాజ్‌కుమార్‌లు సోదరులు. వీరి తల్లిదండ్రులు సాంబయ్య, రాజేశ్వరీలు 2021లో కరోనాతో మృతి చెందారు. దీంతో ఇద్దరు సోదరులు ఖమ్మంలోనే నివాసం ఉంటుండగా, స్టాలిన్ సికింద్రాబాద్ సమీపంలోని సీతాఫల్‌మండిలో రూమ్ అద్దెకు తీసుకుని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో సోదరుడు గోనెల రాజ్‌కుమార్ ఖమ్మంలోనే ఓ అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడో సోదరుడు భానుప్రసాద్ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో (మిగతా 6వ పేజీలో)



మల్లెమడుగులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పండుగలోపు ఇళ్ల కేటాయింపు

మల్లెమడుగులో నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి లోపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలోని మల్లెమడుగు గ్రామంలో బుధవారం డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. మల్లెమడుగు గ్రామంలో మూడు బ్లాక్‌లలో నిర్మిస్తున్న 84 ఇళ్లను, అక్కడి పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి దశలో ఉన్న చిన్న, చిన్న పనులను రెండు రోజులలో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సంక్రాంతి లోపు అర్హులైన నిరుపేద లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివసించే వారికి కావలసిన మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆదేశించారు. (మిగతా 6వ పేజీలో)

శ్రీమన్నారాయణుడిని సేవించుకునే పర్వదినమే

ముక్కోటి ఏకాదశి

» జ్ఞాన సంపదకు నిలయం భద్రాద్రి దివ్యక్షేత్రం

భద్రాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి దేవతలు శ్రీ వైకుంఠంలో చేరి శ్రీమన్నానారాయణున్ని సేవించుకునే పర్వదినమే ముక్కోటి ఏకాదశి. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన తరువాత వచ్చే శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశిగా పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి నాడు భక్తి శ్రద్ధలతో ఎవరైతే ఉపవాసం ఉండి భగవాన్నమసంకీర్తనము, జాగారంతో గడుపుతారో వారికి తప్పక మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. ఆషాడ శుద్ధ ఏకాదశి నాడు శేషశయ్యపై జగద్రక్షణ చింతానపరమైన యోగ నిద్రలో ఉన్న మహావిష్ణువు నాలుగు నెలల తరువాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు బ్రహ్మాది దేవతలకు దర్శన భాగ్యం ప్రసాదించే పర్వదినం వైకుంఠ ఏకాదశి. సృష్ట్యాదిలో విశ్వసృష్టికి సంకల్పం చేసిన రోజని శాస్త్రాలు చెబుతున్నాయి. భగవదర్శనం కోసం పరితపించే దేవతలందరూ ఈ నాలుగు నెలలు దీక్షతో చాతుర్మాస వ్రతంగా ఆచరిస్తారని యతిధర్మ సముచ్చియం అనే ధర్మశాస్త్రం చెబుతోంది. సకల జీవ రాశుల్లో విష్ణురూపంగా అంతర్యామిగా ఉన్న పరమాత్మకు విశ్రాంతి (యోగ)కాలమైన ఈ నాలుగు మాసాల్లో అందరూ దైవ చింతనలో ఉండాలని హర్షవాణి బోధిస్తోంది. అందుకే యతీశ్వరులు, సన్యాసులు తమ నిత్య సంచారం మానివేసి ఏదో ఒక పవిత్రమైన చోట జప తపాదులతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. చాతుర్మాస వ్రతానికి ఫలంగా వచ్చే మార్గశిర శుద్ధ ఏకాదశే ఈ ముక్కోటి ఏకాదశి. సంక్రమణాన్ని అనుసరించి ఒక్కొక్కసారి పుష్యశుద్ధ ఏకాదశి నాడు కూడా ఈ ఉత్సవాన్ని ఆచరిస్తారు. పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై వేంచేసి ఉన్న శ్రీ మహావిష్ణువును ఎవరైతే సేవిస్తారో వారికి భగవదానుగ్రహం, మోక్షం తప్పక సిద్ధిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఉత్తర ద్వారదర్శనం వలన జన్మ రాహిత్యం, మోక్షం తప్పక కలుగుతాయని పరమపురుష సంహిత అనే ఆగమశాస్త్రం తెలుపుతోంది.



ఉత్తర ద్వారంలో శ్రీ మహావిష్ణువు అలంకారంలో రామయ్య

జ్ఞానానికి మోక్షానికి ప్రతీక

భద్ర మహర్షికి మోక్షాన్ని ప్రసాదించడానికి శ్రీ మహావిష్ణువు భద్రాద్రిలో వెలిశారు. స్వతహాగా స్వామికి భక్తులకు కావాల్సినవి అన్ని తెలుసు. అయితే రాముని కోసం చేసిన తపస్సు రామకృపే కాబట్టి మోక్షాన్ని ప్రసాదించడానికి స్వామి శ్రీ మహావిష్ణువు అలంకారంలో కుడిచేతిలో శంఖం ధరించి మోక్ష ప్రదాతగా నిలిచారు. జ్ఞానంకు, మోక్షానికి ప్రతీకగా ఉండే ఇక్కడ స్వామి వారిని విద్యార్థులు సేవిస్తే జ్ఞాన సంపద బాగా అభివృద్ధి చెందుతుంది. తద్వారా తాను సంపాదించుకున్న జ్ఞానముతో సిరి సంపదలతో తులతూగుతారు. ఈ శక్తి ఇక్కడ పూజ చేసుకున్న ప్రతి ఒక్కరికి దక్కుతుందని బ్రహ్మపురాణం ద్వారా తెలుస్తోంది.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

రివర్ ఫెస్టివల్‌కు

ఏర్పాట్లు పూర్తి

» భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాచలం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా గురువారం తెప్పోత్సవం, శుక్రవారం తెల్లవారుజామున జరిగే ఉత్తరద్వార దర్శనాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు, పర్యాటకులు హాజరుకావాలని కలెక్టర్ జితేష్‌వి పాటిల్ కోరారు. భద్రాచలంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈ ఏడాది తొలిసారిగా నిర్వహించే రివర్ ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందన్నారు. గిరిజన సంప్రదాయ వంటకాలు, బోటింగ్, ట్రెక్కింగ్ వంటి వాటితో పర్యాటకాన్ని జోడించామని అన్నారు. భక్తులు, పర్యాటకులు భద్రాచలంలో రాత్రి బస చేసి మరుసటి రోజు మ్యూజియం, బొజ్జిగుప్ప, బెండలపాడు ట్రెక్కింగ్‌ను వీక్షించాలన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి దీవులను చూడాలనుకున్న వారు మన కిన్నెరసానిలో పర్యటించాలని కోరారు. ఏర్పాట్లన్నీ మహిళ సమాఖ్య ద్వారా సభ్యులు పూర్తి చేశారని, రివర్ ఫెస్టివల్ మార్చి వరకు కొనసాగిస్తామని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు ఉత్తరద్వారం వద్ద పదో తేదీన ముక్కోటిని పురస్కరించుకొని చేపట్టాల్సిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమయంలో సంబంధిత అధికారులు మూడు గంటలకు భక్తులను ఉత్తరద్వారంలోని వివిధ సెక్టార్లలోకి అనుమతిస్తామని, స్వామి వారు ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు భక్తులకు దర్శనమిస్తారని, అనంతరం ఉత్తరద్వారం ద్వారా భక్తులు మూలవరుల దర్శనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.

నిధుల లేమి.. నిర్వహణ భారం

» జిల్లాలో 67 క్లస్టర్లలో రైతు వేదికలు
» బిల్లులు చెల్లించక పనిచేయని ఇంటర్‌నెట్
» రైతు నేస్తం ఖర్చులన్నీ ఏఈవోలపైనే..

కొత్తగూడెం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భౌగోళికంగా వ్యవసాయ వనరులు పుష్కలంగా ఉండటంతో వ్యవసాయ రంగంలో రైతులను చైతన్యవంతం చేసేందుకు, నూతన పద్ధతుల్లో సాగు చేయడంలో నైపుణ్యం పెంచేందుకు రైతు వేదికలను గత ప్రభుత్వం నిర్మించింది. 5000 మంది రైతులకు ఒక క్లస్టర్ ఏర్పాటుచేసింది. ఒక్కో క్లస్టర్‌లో ఒక రైతు వేదిక నిర్మించింది. వీటిల్లో రైతులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

నిధులు నిలిచాయి..

ఈ వేదికలలో పంటలసాగులో అనుసరించాల్సిన కొత్త విధానాలను రైతులకు వివరిస్తున్నారు. కానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఏఈవోలకు నిర్వహణ భారంగా మారింది. 2022-23 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు అయిదు నెలలకు రూ.9వేల చొప్పున రూ.45వేలు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత నిధులు మంజూరుకు నోచుకోకపోవడంతో ఏఈవో లు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 67క్లస్టర్లను ఏర్పాటుచేసి రూ.22లక్షలతో వ్యయంతో 67 రైతు వేదికలు నిర్మించారు. ప్రతి రైతు వేదికలో సమావేశాలు నిర్వహించుకునేందుకు కుర్చీలు, తదితర సామగ్రి సమకూర్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు, అన్నదాతలతో మాట్లాడేందుకు వీలుగా 23 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించారు. మండల కేంద్రానికి ఒకటి చొప్పున వీసీ సదుపాయం ఉంది.

పేరుకుపోతున్న బిల్లులు

చాలా క్లస్టర్లలో రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించారు. మహిళా ఏఈఓలు ఈ వేదికలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న రైతు వేదికల్లో ఏర్పాటుచేసిన వీసీ పరికరాలు, ఫర్నిచర్‌కు భద్రత కరువైంది. ఏఈఓలు నిత్యం వేదికలు శుభ్రం చేసేందుకు స్వీపర్లను నియమించుకున్నారు. ప్రతి నెల స్వీపర్లకు జీతభత్యాలు చెల్లించాలి. నిధులు రాకపోవడంతో పనిచేసేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇంటర్‌నెట్ కనక్షన్లు ఇవ్వలేదు. ప్రతి నెల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. వీటిని చెల్లించే నిధులు లేక ఏఈవోలు విద్యుత్ సిబ్బందికి ముఖం చాటేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కనక్షన్లు కట్ చేస్తామని అంటున్నప్పటికీ ఉన్నతాధికారులు సర్దిచెప్పుకొస్తున్నారు.

ఖర్చుల భారం ఏఈవోలపైనే

సమావేశాలు నిర్వహించే సమయాల్లో టీ, బిస్కెట్లు ఖర్చులు ఏఈవోలు భరిస్తున్నారు. ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీటికి హాజరయ్యే రైతులకు మంచినీరు అందించాలన్న ఏఈఓలపై భారం పడుతుంది. ఈ వేదికల్లో టాయిలెట్లు లేకపోవడంతో



మహిళా ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరమ్మతులు చేయాలి..

కొన్ని వేదికల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పనిచేయడం లేదు. చుట్టూ ప్రహరీగోడ, ఫెన్సింగ్‌లు లేకపోవడంతో మందుబాబులకు అడ్డగా మారుతున్నాయి. సెప్టెంబరులో లో కురిసిన వర్షాలకు లోతువాగు, చర్లలో సీలింగ్ పడిపోవడంతో ఉన్నతాధికారులు సమస్యను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయి. రైతు వేదికలకు నిధులు విడుదల జాప్యం పై వివరణ కోరేందుకు డీఏవో బాబురావుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఖాళీ సంచులు లేక

ధాన్యం కొనుగోళ్లకు బ్రేక్

» వారాల తరబడి కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ

చంద్రుగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు నిలిసిపోయింది. మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొన్ని కేంద్రాలో ఖాళీ సంచులు లేక కొనుగోలు జరగటంలేదు. మరికొన్ని కేంద్రాల్లో లారీలు, తూర్పార బట్టే యంత్రాలు సరిపడ లేక నామమాత్రంగా సాగుతుంది. దీంతో కేంద్రాల్లో వేలాది బస్తాల ధాన్యం పేరుకుపోయింది. తూకాల కోసం ఎదురుచూస్తూ రైతులు వారాల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. సంచులు అందుబాటులో ఉంచుతూ, తూకాలను పర్యేక్షించాల్సిన అధికారులు జాడలేరు. ఇకసిబ్బంది వారికి నచ్చిన సమయంలో కేంద్రాలకు వచ్చిపోతూ రైతుల పట్ల అధికాల దర్పం ప్రదర్శిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

సిబ్బంది తెరచాటు వ్యవహారం..

కేంద్రాలు ప్రారంభ సమయంలో ఆర్భాట ప్రకటనలు చేసిన ఉన్నతాధికారులు. అనంతరం వారి పర్యేక్షణ లేకపోవటంతో స్థానిక అధికారులు, సిబ్బంది కొందరు ఇషా రాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు రైతుల విమర్శిస్తున్నారు. త్వరగా కొనుగోలు చేసేందుకు సిబ్బంది సహకారంతో కొందరు అధికారులు తెరచాటు వ్యవహారం నడుపుతున్నట్లు కొందరు రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధిక ధర లభిస్తున్నా కేంద్రాల్లో సాటి రైతులు పడే అగసాట్లు చూచి తక్కువ ధరకు దళారులకు విక్రయించుకుంటున్నట్లు కొందరు రైతులు తెలిపారు. ఇప్పటికే వేలాది బస్తాలు దళారుల పాలైయినట్లు రైతులు తెలిపారు.



కొనుగోలు కేంద్రంలో రైతుల పడిగాపులు

కృష్ణావతారంలో రామయ్య దర్శనం



కృష్ణుడికి ఊంజల్ సేవ..

భద్రాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా బుధవారం సీతారామచంద్రస్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో భక్తులు స్వామి వారిని తిలకించి పులకరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించి శ్రీకృష్ణవతారాన్ని అందంగా అలంకరించారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి నివేదన చేశారు. ఈ సమయంలో భక్తులు స్వామి వారిని భక్తి ప్రపత్తులతో తిలకించి తరించారు. శ్రీ కృష్ణ అవతారంలో దర్శనమిచ్చిన రామయ్యను చూసేందుకు భారీ ఎత్తున భక్తులు తరలిరావడం విశేషం. అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు.



విద్యుద్దీపాలంకరణలో భద్రాద్రి ఆలయం

దేదీప్యమానం.. భద్రాద్రి క్షేత్రం

(5వ పేజీ తరువాయి)

1200 మందితో బందోబస్తు

భద్రాద్రిలో తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం తిలకించేందుకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా వారు తరలివెళ్లేలా అడుగడుగునా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు భద్రాచలం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఏఎస్‌పీ) విక్రాంత్‌కుమార్‌సింగ్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రామాలయం, ఉత్తర ద్వారం ప్రాంతం, గోదావరి స్నాన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి నిలిపినట్లు తెలిపారు. 1200 మందితో బందోబస్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో ఏసీపీ/డీఎస్పీలు ఏడుగురు, 25 మంది సీఐలు, 70 మంది ఎస్సై/ఆర్ఎస్సైలు, 170 మంది ఏఎస్సైలు/హెడ్ కానిస్టేబుళ్ళు, 350 మంది కానిస్టేబుళ్లు, మహిళా పోలీసు సిబ్బంది 90 మంది, హోం గార్డులు 260 మందితో పాటు సాయుధ పోలీసు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, ఇతర పోలీసులు సేవలందిస్తారని తెలిపారు. ఆరు రోప్ పార్టీలు, 24 గంటలు వాహనాలతో పాటు అనుమానిత వ్యక్తుల తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.



తెప్పోత్సవానికి సిద్ధమైన హంస వాహనం

'ఏరు' పండుగకు సర్వం సిద్ధం

» ముక్కోటి భక్తులకు పర్యాటక విందు.. » మూడు రోజుల ప్యాకేజీలో రెండు రాత్రులు గోదావరి తీరంలో బస



సెల్ఫీ పాయింట్



ఏరు వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్

భద్రాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో నేటి నుంచి మూడు రోజుల పాటు 'ఏరు.. ది రివర్ ఫెస్టివల్' పర్యాటకులకు కనువిందు చేయనుంది. జిల్లా చరిత్రలో తొలిసారిగా ఏజెన్సీ గిరిజన సంస్కృతిని నేటి ఆధునిక ప్రపంచానికి పరిచయం చేసేందుకు ముక్కోటికి వచ్చే భక్తులను ఆకర్షించే విధంగా జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాలను ఇప్పటికే ఏరు ఫెస్టివల్‌లో భాగంగా పర్యాటకులు వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పర్యాటక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ప్రత్యేక చొరవతో ఇందుకు రూప కల్పన చేసి జిల్లా ఏజెన్సీ పర్యాటకానికి మరింత శోభను తీసుకొచ్చారు. ఏరు ది రివర్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపే వారు మూడు రోజులు ఇందులో పాల్గొంటారు. ఇందులో రెండు రాత్రులు సైతం గోదావరి నదీ తీరంలో బస చేస్తారు. ఇందుకుగాను ఒక్కొక్క పర్యాటకుడి నుంచి రూ.6 వేలు, 12 ఏళ్లలోపు చిన్నారులకు రూ.4 వేలు ప్యాకేజీగా నిర్ణయించినట్లుగా కలెక్టరు తెలిపారు. భద్రాద్రి రామయ్య దర్శనంతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం తెప్పోత్సవం, ఉత్తర ద్వారదర్శనం, కిన్నెరసానిలో బోటింగ్, డీర్ పార్కు తిలకించనున్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ మ్యూజియంను తిలకించడంతో పా టు దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పలో గిరిజనుల సంస్కృతి, ఆట, పాటలతో మమేకం కానున్నారు. చివరగా చంద్రుగొండ మండలం బెండలపాడులో ట్రెక్కింగ్‌లో పాల్గొని అనంతరం ఎవరి గమ్య స్థానాలకు వారు వెళ్లడం జరుగుతుంది. ఈ సమయంలో ప ర్యాటకులను పర్యాటక స్థలాలకు చేరవేయడం, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం రాత్రి భోజనం ఈ ప్యాకేజీలో భాగంగానే అందిస్తారు. గోదావరి నదీ తీరంలో 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా అందులో వివిధ రకాల గిరిజన అటవీ ఉత్పత్తులు, ఔష.ద మొక్కలు, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు, తేనె, ఇతరత్రా గిరిజన ఉత్పత్తులు విక్రయానికి అందుబాటులో ఉంచారు.

సంక్రాంతిలోపు 'డబుల్' ఇళ్ల పంపిణీ

(5వ పేజీ తరువాయి)

మల్లెమడుగులో 84, కూసుమంచి మండలం దుబ్బ తండాలో 29, నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెంలో 18, మొత్తం 131 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారుల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వీటిని పేదలలో నిరుపేదలకు, అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం అర్బన్, రూరల్ మండల తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు దూరంగా పతంగులు ఎగురవేయాలి

కొత్తగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖాళీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు దూరంగా పతంగులు ఎగురవేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ జి. మహేందర్ అన్నారు. పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేయడం సంప్రదాయంగా వస్తుందని, సురక్షిత ప్రాంతాల్లో పతంగులు ఎగురవేయాలని కోరారు.. విదుత్ లైన్లు లేని బహిరంగ ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటిస్తూ పతంగులు ఎగురవేసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

దుర్గా ఓబీ కంపెనీలో తరచూ ప్రమాదాలు

మణుగూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని దుర్గా ఓబీ కంపెనీలో తరచూ ప్రమాదాలు జరుగుతూ కార్మికులు క్షతగాత్రులౌతున్నారు. కానీ సింగరేణి యాజమాన్యం మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వెలువడుతున్నాయి. ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడికి రెండు కాళ్లు విరిగిపోయినట్లు సమాచారం. అయితే ఈ ఘటన జరిగి నాలుగు రోజులు కావస్తున్నా దుర్గా ఓబీ కంపెనీ నిర్వాహకులు మాత్రం గోప్యంగా దాచారు. ఈ విషయం ఆనోట ఈ నోట పడి మొత్తానికి వెలుగు చూసింది. అసలు సంగతేంటంటే ఓబీ కంపెనీలో జరిగిన ఈ ప్రమాదం కనీస సమాచారాన్ని స్థానిక గని అధికారులకు, ఏరియా ఉన్నతాధికారులకు కూడా తెలపకుండా దుర్గా కంపెనీ నిర్వాహకులు వ్యవహరించినట్లు తెలిసింది. ఏదైనా ప్రమాదం జరిగినా వాటికి సంబంధించి వెంటనే సమాచారాన్ని అందివ్వాలి. ఇందుకు సంబంధించి కచ్చితమైన నియమ నిబంధనలు ఉన్నాయి. అయితే దుర్గా కంపెనీ స్థానిక నిర్వాహకులు మాత్రం ఒక్క నిబంధననూ పాటించడం లేదని ఆరోపణలు సర్వత్రా వెలువడుతున్నాయి. ప్రమాదాలు చిన్నవైనా పెద్దవైనా జరిగినప్పుడు కనీస సమాచారం స్థానిక సింగరేణి గని అధికారులకు ఇవ్వాల్సి ఉండగా అలా ఇవ్వకపోవడం దారుణమైన విషయమన్న విమర్శలున్నాయి. ఇటీవల టైర్ సెక్షన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేసే విప్పల సింగారం ప్రాంతానికి చెందిన రాముపై సన్నీ టైర్ పడటంతో అతనికి రెండు కాళ్ల తొడ ఎముకలు విరిగినట్లు సమాచారం. వెంటనే క్షతగాత్రున్ని భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి గుట్టు చప్పుడు కాకుండా వైద్య సేవలందిస్తున్నట్లు తెలిసింది. బాధిత కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఆలస్యంగా అందించారనే ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. దుర్గా కంపెనీ మేనేజర్ ఇక్కడ కార్మికుల పట్ల పలు సందర్భాల్లో అనుచితంగా వ్యవహరించే వాడని, ఇష్టారాజ్యంగా దుర్భాషలాడుతుండాడనే విమర్శలు సైతం వినవస్తున్నాయి.

అన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు..

(5వ పేజీ తరువాయి)

ట్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో వీరు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇంకా వివాహం కాలేదు.

అయితే సికింద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న స్టాలిన్ నాలుగు రోజుల క్రితం సెలవు పెట్టి ఖమ్మానికి వచ్చాడు. ఇంటికి వచ్చినప్పటి నుంచి అతడు మద్యం తాగి తన మూడో సోదరుడైన భానుప్రసాద్‌తో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా అతడు భానుప్రసాద్‌ను తిట్టడంతో కోపోద్రిక్తుడైన అతడు ఎలాగైనా తన అన్నను భయపెట్టాలని మద్యం తాగి ఆ మత్తులోనే నగరంలోని తుమ్మల గడ్డ సమీపంలో ఓ పెట్రోల్‌బంక్‌లో రూ.30పెట్రోల్ కొనుగొలు చేసి ఇంటికి వెళ్లి ఇంటి పైఅంతస్తులో నిద్రిస్తున్న అన్న స్టాలిన్‌పై పోసి నిప్పంటించాడు. దీంతో స్టాలిన్ కేకలు వేయడంతో కింద్రి అంతస్థులో నిద్రిస్తున్న మరో సోదరుడు రాజ్‌కుమార్ పైకి వచ్చి నీళ్లు చల్లి మంటలను ఆర్పాడు. అయితే అప్పటికే స్టాలిన్ శరీరం 30శాతం కాలడంతో కుటుంబ సభ్యులు వెంటనే అతడిని నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రెండో సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు భానుప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అదనపు కలెక్టర్‌కు గుండెపోటు

(5వ పేజీ తరువాయి)

ఖమ్మంలోని సంకల్ప ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆయనకు ఆస్పత్రి వైద్యుడు సీతారాం నాయక్ పరీక్షలు నిర్వహించగా ఈసీజీలో ఆయనకు తీవ్ర గుండెపోటు వచ్చినట్లు గుర్తించారు. దీంతో యాంజియోగ్రామ్ చేశారు. యాంజియోలో గుండెకు సరఫరా చేసే రెండు దమనుల్లో ఒక నాళం 100శాతం, రెండో నాళంలో 80శాతం పూడుకుపోవడంతోనే గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించారు. వెంటనే డాక్టర్ సీతారాం నాయక్ బృందం (బెలూన్ యాంజియో ప్లాస్టిక్ విధానంలో) స్టెంట్ వేశారు. దాదాపు రాత్రి ఒంటి గంట వరకు స్టెంట్ వేయడంతో ఆయన పరిస్థితి నిలకడగా అయ్యింది. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంకల్ప ఆస్పత్రికి చేరుకున్నారు. జేసీ పరిస్థితిని వైద్యులతో ఉండి పరిశీలించారు. రాత్రి ఒకటిన్నర తర్వాత ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలుసుకున్న తర్వాత వెళ్లిపోయారు. కాగా, మెరుగైన వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ వైద్యులు ఆయన వెంట ఉండి హైదరాబాద్ తరలించి అక్కడ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం శ్రీనివాసరెడ్డి కోలుకుంటున్నారు.

పేదల బియ్యం పక్కదారి...

(5వ పేజీ తరువాయి)

వారం క్రితం తిరుమలాయపాలెం మండలంలోనూ ఖమ్మంవైపు వస్తున్న 150క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల బియ్యం నిలువలు ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు గాలింపు ముమ్మరం చేశారు.

ఖమ్మం నుంచే రవాణా

దశాబ్దాలుగా తెలంగాణలోని పలు జిల్లాలనుంచి రేషన్‌బియ్యం లారీలు ఖమ్మంమీదుగానే కాకినాడ, బందర్ పోర్టులకు వెళుతున్నాయి. గ్రామాల్లో రేషన్‌డీలర్లు కార్డుదారులనుంచి కిలోకి రూ.5నుంచి 8వరకు నగదు చెల్లించి ఆ బియ్యాన్ని వ్యాపారులకు కిలో రూ.12వరకు అమ్ముకుంటున్నారు. ఇలా గ్రామాలనుంచి మండలాలకు, మండల కేంద్రం నుంచి నేరుగా కాకినాడ పోర్టుకు వ్యాపారులు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి రేషన్ గోనె సంచులు కాకుండా ఇతర సంచులలో ప్యాక్ చేసి పోర్టుకు చేర్చి ఇతర దేశాలకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారం కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల కాకినాడ పోర్టులో భారీగా రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసులు నమోదు చేయడంతో బియ్యం వ్యాపారుల్లో అలజడి నెలకొంది ప్రస్తుతం పరిస్థితి బాగాలేదని తెలంగాణ నుంచి రేషన్‌బియ్యం తీసుకురావద్దని వ్యాపారులకు సమాచారం రావడంతో ప్రస్తుతం రేషన్‌బియ్యం లారీలు స్థానికంగా రహస్య ప్రదేశాలకు, గోదాంలకు తరలించి బియ్యాన్ని నిలువ చేశారు. మళ్లీ పరిస్థితి వారికి అనుకూలిస్తే రేషన్‌బియ్యం తరలిపోయే అవకాశం ఉంది. అయితే కొందరు వ్యాపారులు మాత్రం కోళ్లఫారాల యజమానులతో మాట్లాడి వారికి ఆ బియ్యం సరఫరా చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల ఉత్పత్తి
- త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



డిప్యూటీ సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్, ఇతర అధికారులు

కొత్తగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, ఈకార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్‌లో తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటుచేసి 1000మెగావాట్ల ఉత్పత్తికి ఇప్పటికే ఇంధనశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో కలిసి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు పాల్గొన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడుతాయని డిప్యూటీ సీఎం అన్నారు. కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గతేడాది నవంబరు 19న జరిగిన ఒప్పందాన్ని కలెక్టర్లు ఉపయోగించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. 5ఏళ్ల కాలంలో కోటీ మంది మహిళలను కోటీశ్వర్లుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మహిళలకు రుణాలు పెద్దమొత్తంలో అందిస్తున్నామని, అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు., మహిళా సంఘాల భూముల్లో రెడ్కో ద్వారా టెండర్లు ఓపెన్ చేసి ఖరారు చేస్తారన్నారు. ప్రతి జిల్లాకు 150ఎకరాలు తగ్గకుండా భూమి సేకరించాలన్నారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలో భూములు గుర్తించాలని, కేంద్ర, అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనుల భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అటవీ భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బందులు ఉండవన్నారు. రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్దఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ఐదెకరాల భూమి సేకరించాలని ఇండస్ట్రీయల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులుభూములు సేకరించాలన్నారు. రాష్ట్రంలో 6.67లక్షల ఎకరాలు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేసిందని, ఆ భూముల్లో లాభసాటి పంటలు సాగు జరగలేదని, ఉపాధి హామీ, గిరిజనశాఖ, స్వయం సహాయక సంఘాల పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ప్రధానమంత్రి పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఆ రైతులు రెండు మెగావాట్ల సోలార్ పవర్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. టీజీ రెడ్కో పోర్టల్‌లో రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. తక్కువ రేటుకు విద్యుత్ అందుబాటులోకి రావడంతో పాటు కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

రైతుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలి

- రైతు బీమా క్లెయిమ్‌లు సకాలంలో పూర్తి చేయాలి
- ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమీక్ష



సమీక్షకు హాజరైన వ్యవసాయ అధికారులు, మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్‌పామ్ సాగు, రైతు బీమా, ఎరువుల నిల్వలు, క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. ప్రతీ క్లస్టర్ పరిధిలో రైతు బీమా కింద వచ్చిన క్లెయిమ్, ఎల్ఐసీకి అందించిన క్లెయిమ్, చెల్లింపులు ఆలస్యానికి కారణాలు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రైతు బీమా క్రింద 420 దరఖాస్తులు వస్తే వ్యవసాయ శాఖ నుంచి 347 దరఖాస్తులు ఎల్ఐసీకి అందించినట్లు తెలిపారు. 311 రైతు కుటుంబాలకు సహాయం క్లెయిమ్ సొమ్ము అందిందని, 36 పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో 73 రైతు బీమా దరఖాస్తులు బీమా సంస్థకు అందించకపోవడానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. వ్యవసాయ అధికారులు సంబంధిత తహసీల్దార్లతో సమన్వయం చేసుకుంటూ డెత్ సర్టిఫికెట్‌లు త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. రైతు మరణించిన సమయంలో దుఃఖంతో ఉండే రైతు కుటుంబాన్ని ఆదుకునే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బీమా పథకం అమలు చేస్తుందని, నిర్ణీత సమయంలో రైతులకు తప్పనిసరిగా చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. వ్యవసాయ అధికారులు మానవీయ దృక్పథంతో పని చేయాలని, రైతులు అందించిన దరఖాస్తులలో ఏదైనా డాక్యుమెంట్ లేకపోతే మనమే వాటిని సమకూర్చే మార్గం తెలపాలని కలెక్టర్ అన్నారు. ప్రతి మండల వ్యవసాయ అధికారి తన పరిధిలో క్లసర్లలో పెండింగ్ రైతు బీమా దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి వచ్చే సమావేశం నాటికి పెండింగ్ ఉండకుండా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పని చేయాలని, రైతులతో సంబంధాలు పెంచుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పనితీరు మెరుగుపరిచేందుకు మండల వ్యవసాయ అధికారులు సహకారం అందించాలన్నారు. క్రాప్ బుకింగ్ సర్వే పకడ్బందీగా జరిగేలా చూడాలని అన్నారు. రైతులకు ఎక్కడ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట అధికంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఎక్కడైనా తప్పుడు ప్రచారాలు వస్తే వెంటనే దానికి అధికారులు వివరణ జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎంవీ మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం: ఆర్టీసీ ఆర్‌ఎం



ఖమ్మం బస్టాండ్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి/భద్రాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్టీసీ ఆర్ఎం సరిరాం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని నూతన బస్టాండ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యశాల వైద్యుల సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 30 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ పవిత్ర, డిపో మేనేజర్ దినేషకుమార్, సీఐ రామయ్య, ఆర్టీసీ వైద్యాధికారి సాయి సుష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

50 మందికి కారుణ్యనియామకాలు

ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ వివిద కారణాలతో మృతి చెందిన, అనారోగ్య కారణాలతో వైదొలిగిన ఉద్యోగుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు గత నెలలో ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో ఉద్యోగంలోకి తీసుకుంటూ ఆర్డర్లు అందించారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50 మందికి బుధవారం ఖమ్మం నగరంలోని నూతన బస్టాండ్‌లో ఆర్ఎం సరిరాం వారికి వివిధ డిపోలలో కండక్టర్లుగా నియమించారు. మధిరకు 8 మంది, భద్రాచలానికి 19 మంది, కొత్తగుడేనికి 7గురు, మణుగురుకు 15 మంది, ఇల్లెందుకు ఒక్కరిని నియమిస్తూ ఆర్డర్లు అందించారు.

భద్రాచలం (ఆంధ్రజ్యోతి) :అత్యవసర సమయాల్లో రక్తం అందించి బాధితులను ఆదుకునే వారే ప్రాణదాతలు అని ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సోసైటీ సంయుక్తాధ్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు 34మంది రక్తదానం చేశారు.

మోదీది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆందోళన



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు హేమంతరావు

ఖమ్మంటౌన్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే నల్లచట్టాలు తెచ్చారని సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, 44రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న జగజిత్‌సింగ్ దల్లేవాల్ దీక్షను విరమింపచేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలు త వి.వెంకటాయపాలెం నుంచి కలెక్టరేట్ వర కు ప్రదర్శన నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. హేమంతరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గతంలోనే వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి కనీస మద్ధతు ధరల హామీ చట్టాన్ని ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని, మూడోసారి అధికారంలోకి వచ్చినా హామీ నెరవేర్చకపోగా, రైతుల పోరాటాలతో గతంలో ఉపసంహరించుకున్న నల్లచట్టాలను దొడ్డిదారిన తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. జాతి సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న ప్రధాని మోదీ, వ్యవసాయరంగాన్ని కూడా వారికి అప్పగించే పనిలో ఉన్నారన్నారు. సంయుక్త కిసాన్‌మోర్చా రైతు లు ఆందోళనలు చేపడుతుంటే కేంద్రప్రభుత్వం స్పందించటం లేదన్నారు. ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎస్‌కే. జానీమియా, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు, రైతుసంఘం నాయకులు యర్లపల్లి శంకరయ్య, నల్లమోతు నర్సింహారావు, శ్రావణ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

డైట్‌లో రూ.8.62కోట్లతో అభివృద్ధి పనులు

నేడు మంత్రి తుమ్మల శంకుస్థాపన

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఖమ్మంలోని టేకులపల్లిలోగల డైట్ కళాశాలకు మహర్దశ లభించింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో డైట్ కళాశాలకు మహర్దశ పట్టనున్నది. మంత్రి కృషితో రూ. 8.62కోట్ల నిధులు మంజూరు కాగా, వివిధ రకాల పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి సిద్ధం చేశారు. గురువారం ఆ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్న క్రమం లో ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయికి చేరుతున్నాయి. రాష్ట్రంలోని రెండు కళాశాలలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా లభించగా. అందులో ఖమ్మం నగరంలోని డైట్ కళాశాల ఒకటి.

మోగిన ఐటీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నగారా

బూర్గంపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేపరు కర్మాగారంలో అగ్రగామిగా నిలిచిన ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు అధికారులు నగరా మోగించారు. బుధవారం ఖమ్మంలో యూనియన్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిఎల్ విజయభాస్కర్‌రెడ్డి ఎన్నికల తేదీని ప్రకటించారు. ఈ నెల 31న బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ కర్మాగారంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఐదు యూనియన్లు పోటీలో ఉండగా.. 1253మంది ఎంప్లాయిస్, బదిలీ కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటునట్లు యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- తులం బంగారం, 18తులాల వెండి స్వాధీనం

తిరుమలాయపాలెం, జనవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన నందిపాటి రామకృష్ణ ఇంట్లో సోమవారం తులంబంగారం చెవిదిద్దులు, మాటీలు, 18తులాల వెండి పట్టీలు చోరీకి గురయ్యాయి. ఈవిషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈచోరీకి పాల్పడిన నిందితుడు కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి పడిశాల సలీమ్‌గా గుర్తించారు. అతడిని పట్టుకుని విచారించిగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి చోరీచేసిన వస్తువులను స్వాధీనం చేసుకొని, బుధవారం కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు.

క్రైం సమాచారం

వేర్వేరు ప్రమాదాల్లో
ముగ్గురి మృతి

అశ్వాపురంలో...

అశ్వాపురం జనవరి 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందగా, మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మొండికుంట కట్టుకాలువ వద్ద బుధవారం జరిగింది. రామచంద్రాపురం గ్రామానికి చెందిన మద్ది శంకర్‌రెడ్డి(70), మొండికుంట గ్రామానికి చెందిన గూడూరు జనార్ధన్‌రెడ్డిలు బీజీ కొత్తూరు గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో నివాళులర్పించి తమ బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈనేపథ్యంలో కట్టుకాలువ వద్ద వెనుకగా జమాయిల్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ముందుగా వెళ్తున్న లారీని తప్పించబోయి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే శంకర్‌రెడ్డి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బూర్గంపాడులో...

బూర్గంపాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం కృష్ణసాగర్ క్రాస్‌రోడ్డు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కొత్తగూడెం కూలీలైన్ ఏరియాకు చెందిన రాంకుమార్ హరిప్రసాద్(43) ఐటీసీ కర్మాగారంలో క్యాజువల్ లేబర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా హరిప్రసాద్ కుటుంబం బూర్గంపాడు మండల పరిధిలోని సందెళ్లరామాపురం గ్రామంలో ఉంటూ ఐటీసీలో క్యాజువల్‌తో పాటు స్థానికంగా ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. కాగా వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంపై రామాపురం వెళ్తుండగా మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు భద్రాచలం నుంచి మణుగూరు వైపునకు వెళ్తుండగా కృష్ణసాగర్ క్రాస్ రోడ్డు వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మణుగూరులో....

మణుగూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండల పరిధిలోని భావికూనవరం రైల్వే గేట్ ప్రాంతంలో ఉన్న రైల్వే ట్రాక్ పై బుధవారం తెల్లారుజామున గూడ్స్ రైలు ఢీ కొని యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూనవరం గ్రామానికి చెందిన ఏనిక గణేష్(20) 10 వతరగతి వరకు చదువుకున్నాడు. కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి రైలు పట్టాలపై మద్యం సేవించినట్లు ఆనవాళ్లు లభించాయి. మద్యం మత్తులో పట్టాలపై పడుకుని ఉండగా గూడ్స్ రైలు ఇతడిని ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.89 కోట్ల విలువైన
గంజాయి దహనం

తల్లాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని మూడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడిన 757కేజీల గంజాయిని బుధవారం తల్లాడ మండలం గోపాలపేటలోని ఏడబ్ల్యూఎం బర్నింగ్ ప్లాంట్‌లో ఎక్సైజ్ అధికారులు కాల్చివేశారు. గంజాయి విలువ రూ.1.89కోట్లు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లాలోని వైరా, కారేపల్లి, ఖమ్మం-2 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన గంజాయిని దహనం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, ఎస్‌హెచ్‌వోలు నాగేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగాల పేరిట..
రూ.కోటి 10లక్షలకు టోకరా

- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో 22మందికి ఓ గిరిజన నాయకుడి వల
- కామేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు
- గత అక్టోబర్‌లో కేసు నమోదు..
- గోప్యంగా ఉంచిన పోలీసులు



విలేకరుల సమావేశంలో తమ గోడు వెల్లడిస్తున్న భాధితులు

కామేపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో సూపర్‌వైజర్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ గిరిజన నాయకుడు రూ.కోటి10లక్షలు వసూలు చేసిన ఘటన ఖమ్మం జిల్లాలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన ఆకారపు రాకేష్ బీకాం చదివి ఇంట్లోనే ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు బోడా మాంగ్యాజీనాయక్ ఎన్సీడీసీఎల్‌లో కంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అయితే మాంగ్యాజీనాయక్ తనకు ఖమ్మం, కొత్తగూడెంలోని అన్ని శాఖల అధికారులతో పరిచయం ఉందని, సింగరేణి సంస్థలో కాంట్రాక్టర్‌గా చేస్తున్న ఓ వ్యక్తి తనకు తెలుసునని, గ్రామంలోనూ చాలామందికి తాను ఉద్యోగాలు ఇప్పించానని మాయమాటలు చెప్పి నాలుగైదు దఫాలుగా రూ.5.5లక్షలు వసూలు బాధితుడు రాకేష్ తెలిపాడు. తనతో పాటు గోవింద్రాలకు చెందిన లకావత్ అశోక్, విశ్వనాథపల్లికి చెందిన గంగాధరణి నాగేశ్వరరావు, బర్లగూడెనికి చెందిన భూక్య హరీష్‌బాబులు కూడా డబ్బులు ఇచ్చాని, అయితే ఉద్యోగాలు రాకపోవడంతో తాము మోసపోయారని గ్రహించి నలుగురం కలిసి గత ఏడాది అక్టోబరు 18న కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అతడి బారినపడ్డ మిగతా వారు తన బంధువులు కావడంతో మాంగ్యాజీనాయక్ వారికి నచ్చచెప్పాడని బాధితుడు తెలిపారు. అతడి బంధువులైనా రేలకాయలపల్లికి చెందిన బోడా రజిత, రాంబాబు వద్ద రూ.2.10లక్షలు, భాగ్యనగరానికి చెందిన భూక్య హరీష్ రూ.2.06లక్షలు, విశ్వనాథపల్లికి చెందిన గంగాధరణి నాగేశ్వరరావు రూ.2లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. తమతో పాటు ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌కు చెందిన మొత్తం 22మంది బాధితులు ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై బుధవారం కామేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మరోసారి బాధితులు ఫిర్యాదు చేశారు. గత ఏడాది అక్టోబరు 18న పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా పోలీసులు గోప్యంగా ఉంచడం గమనార్హం.. ఈ విషయంపై కామేపల్లి ఎస్ఐ బి. సాయికుమార్‌ను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందని తెలిపారు.


బయోమెట్రిక్‌తో మోసం..

- రూ.6వేలు నగదు గల్లంతైనట్లు వాపోయిన బాధితుడు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కరకగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్‌తో ఓ వ్యక్తి కొంత నగదును కాజేసిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిరుమళ్ల పంచాయతీ చందా వారి గుంపు గ్రామానికి చెందిన చందా ప్రసాద్ మంగళవారం మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు వద్దకు నగదు కోసం వెళ్లాడు. కాగా బ్యాంక్‌లో నగదు లేదని బ్యాంక్ సిబ్బంది తెలిపారు. దీంతో కరకగూడెం ప్రధాన సెంటర్‌లోని ఓ బయోమెట్రిక్ నిర్వాహకుడి వద్దకు వెళ్లగా, అక్కడ ఆ వ్యక్తి బ్యాంక్ లిమిట్ అయిపోయిందని రెండుమార్లు వేలి ముద్రలు తీసుకున్నాడని తెలిపాడు. రిసిప్ట్ కూడా ఇవ్వకుండా రూ.6వేలు విత్‌డ్రా చేసుకున్నట్లు వాపోయాడు. విషయం తెలియక బుధవారం మరోసారి ఏపీజీవీబీ బ్యాంకు వద్దకు నగదు కోసం వచ్చిన ప్రసాద్ తన ఖాతాలో రూ. 40వేలు పైగా ఉండగా, అందులో నుంచి రూ.20వేలు తీసుకున్నాడు. ఇంకా రూ.14వేలు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారన్నారు. వెంటనే బ్యాంకు మేనేజర్‌ను ఆశ్రయించగా, రూ.6వేలు విత్‌డ్రా అయినట్లు తెలపడంతో విషయం తెలిసిందని బాధితుడు వాపోయాడు. అమాయక ప్రజలను మోసం చేస్తున్న బయో మెట్రిక్ నిర్వాహకులపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- ఇరువురి పరిస్థితి విషమం



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

బూర్గంపాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఇరువురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం సారపాకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పాల్వంచ మండలం రేగులగూడెం గ్రామానికి చెందిన పొలెబోయిన ప్రవీణ్, శాంత అనే ఇరువురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై భద్రాచలం వైపునకు వెళ్తుండగా, మండల పరిధిలోని సారపాక వారపుసంత సమీపంలో మణుగూరు క్రాస్ రోడ్డు వైపునకు వెళ్తున్న లారీ వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు భద్రాచలం తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఖమ్మం తరలించారు. కాగా క్షతగాత్రులు ఇరువురు తల్లి, కుమారుడిగా తెలుస్తోం ది. క్షతగాత్రురాలి భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రఘునాథగూడెంలో 70 మందికి అస్వస్థత

- ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రఘునాథగూడెం గ్రామంలో గొట్టపుబావిలో (చేతిపంపు) నీరు తాగడంతో మంగళ, బుధవారాల్లో సుమారు 70 మంది వాంతులు, విరోచనాలు సోకి అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య శాఖ తరుపున గత రెండు రోజులుగా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందించారు. రఘునాథగూడెంలో స్థానికంగా గల అందుబాటులో ఉన్న చేతిపంపుల నుంచి పలు కుటుంబాల వారు ఆ నీటిని తాగేందుకు వినియోగిస్తున్నారు. గత రెండు రోజులుగా నీరు తాగిన వారు వాం తులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానికులు ప్రభుత్వ వైద్యశాఖ వారికి సమాచారం అందించారు. వారు స్పందించి బాధితులకు చెన్నూరు ప్రభుత్వ వైద్యాధికారి తబస్సుమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కాగా ఆరోగ్యపరంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సురక్షితంగా ఉన్నారని తెలిసింది. బుధవారం కూడా రఘునాథగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మందులు పంపిణీ చేశారు.

రఘునాథబంజర గ్రామంలో చేతిపంపుల నీరు తాగడంతో పలువురు వాంతులు, విరోచనాలు సోకినందున అధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వాటిని సీజ్ చేశారు. ఈ నీటిని పరీక్షించేందుకు శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపడం జరగుతుందని ఎంపీవో సురేష్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యాధికారి తబుస్సుమ్ తెలిపారు.

'అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి'

ఖమ్మంటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైరారోడ్, బైపాస్‌రోడ్‌లలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరపాలకసంస్థ నిబంధనలు పాటించకుండా, పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నార న్నారు. అక్రమ నిర్మాణాలపై సీపీఎం ఆధ్వర్యంలో అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చి నా పట్టించుకోలేదన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ స్పందించి, అక్రమ నిర్మాణాలపై విచారణ చేసి, అవసరమైతే కూల్చివేయాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై త్వరలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు సుదర్శన్ పేర్కొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు (కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	54
పచ్చిమిర్చి	38
కాకరకాయ	58
బెండకాయ	64
పొట్లకాయ	50
దోసకాయ	38-44
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	60-64
సొరకాయ	28
క్యారెట్	46
క్యాప్సికం	58
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	165
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

రైతు సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

» తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని

ఖమ్మంటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించటంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నదని తెలంగాణ రైతుసంఘం (సీపీఎం) రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేసి చట్టబద్ధమైన మద్ధతు ధరలు ప్రకటించాలని, 44రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతునేత జగజిత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం నగరపాలకసంస్థ పరిధిలోని కొత్తగూడెంలో రైతులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎర్రబోయిన లింగయ్య స్మారకభవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం చేయటంలో అలసత్వ వైఖరి అవలంభిస్తున్నదన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఉద్యమంతో రద్దు చేసిన మూడు నల్లచట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నదన్నారు. భూభారతి ఆర్‌వోఆర్ చట్టం 2024లో భాగంగా సమగ్ర భూసర్వే చేసి సాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ భూఆధార్‌కార్డ్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రకమిటీ సభ్యుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ, రైతు భరోసా, పంటల బోనస్ సక్రమంగా అమలు కావటం లేదని విమర్శించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో మిర్చిపంట సాగు చేసిన రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, గత ఏడాది మిర్చి క్వింటాకు రూ.22 వేలు ఉందని, సీజన్ ముగింపులో రూ.16వేలకు తగ్గి, నేటికి అదే ధర కొనసాగుతుందన్నారు. దీంతో క్వింటాకు రూ.7వేలనుంచి రూ.8వేలు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి క్వింటాకు రూ.20వేలుగా నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రమేష్, ఎస్‌కే. మీరా, వాసిరెడ్డి ప్రసాద్, సహాయ కార్యదర్శులు, సీపీఎం ఖమ్మం అర్బన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రబోయిన గోవింద్, కూసుపూడి మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నాణ్యత పెంచండి

» డీపీవో ఆశాలత » బోదులబండ ఉన్నత పాఠశాలలో భోజనం పరిశీలన



బోదులబండ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీవో ఆశాలత

నేలకొండపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాని డీపీవో ఆశాలత మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. డీపీవో బుధవారం బోదులబండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులను అడిగి ప్రతి రోజూ భోజనం ఎలా పెడుతున్నారంటూ ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం నాసిరకంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతీరోజూ భోజనం నాణ్యత పరిశీలించాకే విద్యార్థులకు పెట్టాలన్నారు. మెనూను అమలు చేయకపోవటం పట్ల నిలదీశారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ పాటించాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకూడదని ఆదేశించారు. డీపీవో వెంట ఎంపీవో శివ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	మార్కో
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370

అర్హులందరికీ పింఛన్లు అందించాలి

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ » వరంగల్ క్రాస్‌రోడ్డులోని లెప్రసీ కాలనీ సందర్శన



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని లెప్రసీ కాలనీని బుధవారం కలెక్టర్ సందర్శించారు.

కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రదానంగా పింఛన్లు, రేషన్ కార్డులు, హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ వీలైనంత త్వరలోనే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. కలెక్టర్ వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో లెప్రసి కాలనీ వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్, ఎంపీవో రాజారావు, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్' లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



భోగి మంటల వద్ద పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హార్వెస్టు పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, గొబ్బెమ్మలు, రంగవల్లులతో ఆకట్టుకున్నాయి.ఈ పండుగ వేడుకలను కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి ప్రారంభించగా భోగి మంటలు వేసి పాఠశాల సిబ్బంది సందడి చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి రంగురంగుల ముగ్గులను అలాగే గాలిపటాలను ఎగురవేసి ఆద్యంతం పండుగ వాతావరణంతో కోలాహలంగా గడిపారు. కరస్పాండెంట్ , ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగ అందరూ కలసి సమూహంగా, ఎంతో సందడిగా చేసుకునే పండుగ, పోటీలు పడుతూ ముగ్గులు వేయడం, గాలిపటాలు ఎగురవేయడం, ఆటలు ఆడటం ఒక సమూహంగా చేసుకోవడం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. ఒంటరిగా సెల్ ఫోన్, టీవీల ముందు గడవడం వలన అటువంటి ఆనందం లభించదు. పిల్లల్ని ఒంటరిగా ఉండనీకుండా సమూహాలతో మమేకం చేయడం ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో ప్రైమరీ హెచ్. ఎమ్. మానస , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

12న మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 19న జరిగే రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ జట్టును ఈనెల 12న ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి నున్నా రాధాకృష్ణ ప్రకటనలో తెలిపారు. పోటీలలో 35 సంవత్సరాలు పైబడిన మహిళలు, పురుషులకు పరుగు, త్రో, జంప్స్ విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధృవీకరణ పత్రంతో ఉదయం 9 గంటల కల్లా స్టేడియానికి హాజరుకావాలని కోరారు.

ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

క్రిస్టియన్ మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సత్యనారాయణ

ఖమ్మం, ఖానాపురంహవేలి జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం కింద అందించే ఉచిత కుట్టు మిషన్ల కోసం క్రిస్టియన్ మైనారిటీ మహిళలు ఆన్‌లైన్‌లో 20లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా నేర్చుకున్న టైలరింగ్ సర్టిఫికేట్, విద్యార్హత సర్టిఫికేట్ కాపీలను జత చేసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోజి ల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయములో సమర్పించాలని, ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9704003002 నందు సంప్రదించాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

పశువైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పలనర్సింహాపురంలో బుధవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, గోపాలమిత్రులు సంయుక్తంగా నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 37 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు.

మందులను పంపిణీ చేశా రు. ముర్రా జాతి లక్షణాలున్న ఒంగోలు జాతి దూడలను పరిశీలించారు. జిల్లా అభివృద్ధి సంయుక్త కార్య నిర్వహణాధికారి డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ గోపాలమిత్రులు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

'చింతలపాటి' ఆశయ సాధనకు కృషి చేయాలి

నేలకొండపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చింతలపాటి రామారావు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం బోదులబండలో జరిగిన రామారావు 10వ వర్ధంతి సభలో రెడ్డి మాట్లాడారు.

చివరి వరకు నిజాయతీ గల కమ్యూనిస్టుగా పని చేశాడని, పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేశాడని కొనియాడారు. తొలుత రామారావు స్థూపం వద్ద ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతలపాటి భాస్కర్, కొరదల సీతారాములు, పొట్టపింజర వెంకటేశం, చింతలపాటి చలపతి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

ఖమ్మంక్రైం, జనవరి8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ రహీం కుటుంబానికి 1989 బ్యాచ్ కానిస్టేబుళ్లు ఆర్థికసాయం అందించారు. అందరు కలిసి రూ.50వేలు నగదును సమకూర్చి సీసీఆర్బీ సీఐ స్వామిచేతులమీదుగా అందించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ సీఐ శివసాంబిరెడ్డి, ఎస్ఐ సుబ్బారావు, పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



హెల్మెట్ల వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తిరుమలాయపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా వాడాలని తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపుడి జగదీష్ అన్నారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో హెల్మెట్‌వాడకంపై రోడ్డుభద్రతావారోత్సవాలలో భాగంగా అవగాహన కలిపించారు. ఆయన మాట్లాడుతూ ప్రాణం ఎంతో విలువైందని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ హరి, పీసీలు వీరస్వామి, లచ్చు, రాజు పాల్గొన్నారు.

కేసులకు భయపడే పార్టీ బీఆర్ఎస్ కాదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేసులకు భయపడే పార్టీ బీఆర్ఎస్ కాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఖమ్మం రూరల్ మండలం, సాయిగణేష్‌నగర్‌లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర ప్రారంభించారు. వారు మాట్లాడుతు పాలేరు నియోజకవర్గ ప్రజలు ఇప్పటికే దేవుడి లాంటి మనిషిని ఓడించామని బాధఎడుతున్నారని తెలిపారు. త్వరలో మళ్లీ పాలేరు ఎమ్మెల్యేగా కందాళ ఉపేందర్‌రెడ్డి రానున్నట్లు వారు తెలిపారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడవద్దని పార్టీకోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు నిలుపుకోవడం చేతకాక కేసులు పెడుతుందన్నారు. కేసులకు భయపడే కార్యకర్తలు కాదు బీఆర్ఎస్ కార్యకర్తలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దులపల్లి జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి రూ.108 కోట్లు మంజూరు

ఖమ్మం రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం, మద్దులపల్లిలో నిర్మించనున్న జేఎన్‌టీయూ కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో రూ.108.60 కోట్లు మంజురు అయినట్లు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ సిబ్బంది బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న జీవో విడుదల చేసినట్లు తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

ఖమ్మం క్రైం, జనవరి8(ఆంధ్రజ్యోతి): నగరంలో పేకాట ఆడుతున్న ముగ్గురుని ఖనాపురం హవేలీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నగర పరిధిలోని దానవాయిగూడెం మున్నేరు కాలవ వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నగరానికి చెందిన వల్లెపు రాము, తమ్మిశెట్టి వెంకట్‌స్వామి, బిక్షం అను వారు పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద నుంచి రూ.7030 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకుని వారిపై కేసు నమెదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఈనెల 22వరకు ఓపెన్ పరీక్ష ఫీజు గడువు

ఏన్కూరు, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఓపెన్ పదో తరగతి ఇంటర్మీడియెట్ పరీక్ష రుసుం ఈనెల 9నుంచి 22వరకు అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాచలం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23నుంచి 29వతేదీ వరకు సబ్జెక్టుకు రూ.25, ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3వరకు సబ్జెక్టుకు రూ.50, తత్కాల్ ఫిబ్రవరి 4నుంచి 6వరకు అపరాధ రుసుం నేరుగా కళాశాలకు వచ్చి చెల్లించాలని కోరారు. వివరాలకు 95733 54994 నెంబరులో సంప్రదించాలని కోరారు.

జాతీయ బంజారారత్న అవార్డుకు దశరథ్‌నాయక్ ఎంపిక

తల్లాడ, జనవరి 8 (ఆం ధ్రజ్యోతి): తల్లాడ మండ లం రంగంబంజర గ్రామానికి చెందిన లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ జాతీయ బంజారారత్న అవార్డుకు ఎంపికయ్యారు.

రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ

» ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఖమ్మంబైపాస్‌రోడ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందరు దాడిచేయడంతో అందుకు నిరసనగా జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని మయూరిసెంటర్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ముం దుగా ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్ నుంచి జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తుండగా మ యూరిసెంటర్ వద్ద వారిని పోలీసులు అడ్డుకుని టుటౌన్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీసులు, బీజేపీ నాయకులకు మధ్యతోపులాట జరిగింది. జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ నాయకుల తలలు పగులగొట్టిన కాంగ్రెస్ నాయకులను కఠినంగా శిక్షించాలని రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలు అమలుచేయడంలో విఫలమయ్యారని దానిని ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులపై భౌతికదాడులకు దిగుతున్నారన్నారు. దాడులు పునరావృతమైతే కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పడానికి బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌నాయక్‌రాష్ట్ర నాయకుల రుద్రప్రదీప్ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్యయాదవ్, మంద సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, దొడ్డా అరుణ, ఏలూరి నాగేశ్వరరావు , చావా కిరణ్, అంకతిపాపారావు దీకొండ శ్యామ్, సాయిరాం, పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

ZONE

గురువారం 9 జనవరి 2025

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

8

వైరా-మధిర

సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న భట్టి

చింతకాని, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సతీమణి నందిని ఫొటోలతో ముద్రించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను భట్టి విక్రమార్క మధిరలో ఆవిష్కరించారు. చింతకాని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడిపల్లి భాస్కర్ సొం త ఖర్చులతో సుమారు రూ.4 వేల క్యాలెండర్లను ముద్రించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొర్రా ప్రసాద్, వనం చిన్నప్ప తదితరులున్నారు.

నేడు తల్లాడలో మంత్రి తుమ్మల పర్యటన

తల్లాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. గురువారం ఉదయం పదిగంటలకు మండలంలోని బిల్లుపాడు గ్రామంలో మాజీ సొసైటీ చైర్మన్, సీనియర్ రాజకీయ వేత్త జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నూతనకల్ గ్రామంలో నిర్మించిన గంగదేవిపాడు సొసైటీ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నారు. మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మల నాగేశ్వరరావుకు మండలంలోని పినపాక గ్రామం నుంచి భారీ కార్ల ర్యాలీతో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు పలు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

మధిర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):మధిర 132కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు నిర్వహిస్తున్నందున ఈనెల 9వతేదీ గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మధిర విద్యుత్ శాఖ ఏడీఈ ఎం. అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా ఆమె కోరారు.

తల్లాడలో...

తల్లాడ, జనవరి8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం పినపాక ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తల్లాడ ఏఈ ప్రసాద్ తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెం, మంగాపురం, గొల్లగూడెం, అంబేద్కర్‌నగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

22వరకు ఓపెన్ పరీక్ష ఫీజు గడువు

ఏన్కూరు, జనవరి8(ఆంధ్రజ్యోతి): ఓపెన్ పదో తరగతి ఇంటర్మీడియెట్ పరీక్ష రుసుం ఈనెల 9నుంచి 22వరకు అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23నుంచి 29వతేదీ వరకు సబ్జెక్టుకు రూ.25, ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3వరకు సబ్జెక్టుకు రూ.50, తత్కాల్ ఫిబ్రవరి 4నుంచి 6వరకు అపరాధ రుసుం నేరుగా కళాశాలకు వచ్చి చెల్లించాలని కోరారు. రెగ్యులర్, సప్లమెంటరీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 95733 54994 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రేపు క్రీస్తుజ్యోతి కళాశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలు

తల్లాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి జూనియర్ కళాశాలలో శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఫాదర్ కె.థామస్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ, రెవెన్యూశాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్, పూర్వ ఖమ్మం పీఠాధిపతి మైపన్‌పాల్, ప్రస్తుత పీఠాధిపతి ఎస్.ప్రకాష్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ బంజారారత్న అవార్డుకు దశరథ్‌నాయక్ ఎంపిక



తల్లాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రంగంబంజర గ్రామానికి చెందిన లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్ జాతీయ బంజారారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ధార్మిక గురువు డాక్టర్ రామ్‌రావ్ మహరాజ్ నాల్గో వార్షికోత్సవం సందర్భంగా సామాజిక సేవ చేసేందుకుగానూ దశరథ్ నాయక్‌కు ఈనెల 11న మహారాష్ట్రలోని పౌరక్షేత్రంలో అవార్డును అందజేయనున్నారు.

శిథిలావస్థలో కల్వర్టు

- మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికుల వినతి
- పట్టించుకోని అధికారులు



చిరునోముల వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

బోనకల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామం వద్ద గల బీబీసీపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి పై ఉన్న కల్వర్టు కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైతులు తమ పొలాలకు ఈ మార్గం గుండా వెళ్తుంటారు. 1975లో నాటి ఎన్ఎస్పీ అధికారులు అప్పటి వాహనాల రాకపోకలు, రోడ్డు సామర్థ్యాన్ని బట్టి వంతెనను నిర్మించారు. కాల క్రమేణ వంతెన పై ఉన్న రహదారి మార్గానికి బీటీ వేయడంతో వాహనాల రద్దీ పెరిగింది. ఆంధ్రా ప్రాంత సరిహద్దు గ్రామాల నుంచి వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుండటంతో అత్యంత ప్రాధాన్యత గల రహదారి మార్గంగా మారింది. వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్థులు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు కొత్త బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాలను అందజేశారు. ఫలితం లేకపోవడంతో నిధుల మంజూరు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. వంతెన కూలిపోయే స్థితిలో ఉందని తెలిసినా, చేసేదేమి లేక ప్రమాదాన్ని పక్కన బెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి వెంటనే బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

భయంతోనే రాకపోకలు సాగిస్తున్నాం

● గూడ నర్సయ్యశాస్త్రి, చిరునోముల



గ్రామం వద్ద గల బీబీసీ కెనాల్ పై గతంలో నిర్మించిన కల్వర్టు కూలిపోయే దశలో ఉంది. భయంతోనే రాకపోకలను సాగిస్తు న్నాం. నూతనంగా బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని గతంలో పలుమార్లు వినతిపత్రాలను అందజేశాం. సమస్య పరిష్కారం కాలేదు. ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించాలి. నూతనంగా బ్రిడ్జిని నిర్మించాలి.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- డీఈవో సోమశేఖరశర్మ



పెనుబల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

పెనుబల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ అన్నారు. బుధవారం మండలంలోని చింతగూడెం, కొండ్రుపాడు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పది విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, పాల్గొన్నారు.

కల్లూరు, జవనరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ అన్నారు. బుధవారం కల్లూరులోని బాలికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది ఫలితాల సాధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్ఎం పి. పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీలకు వేతనాల విడుదల పట్ల హర్షం



చైర్మన్‌కు మిఠాయిలు అందిస్తున్న ఆర్పీలు

సత్తుపల్లిరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రీసోర్స్ పర్సన్లకు వేతనాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆర్పీలు హర్షం వ్యక్తం చేస్తూ మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌కు ధన్యవాదాలు తెలుపుతూ మిఠాయిలు అందజేశారు. కాగా ఇక నుంచి వేతనాలు మునిసిపాలిటీ కార్యాలయం నుంచే అందనున్నాయి.

గరికపాడు కల్వర్టు పరిశీలన



కల్వర్టును పరిశీలిస్తున్న డీఈ రమేష్

వైరా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడులో రిజర్వాయర్ ఎడమ కాల్వపై శిథిలావస్థలో ఉన్న కల్వర్టును బుధవారం వైరా ఆర్అండ్‌బీ డీఈ రమేష్ పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న కల్వర్టును పునర్నిర్మించాలని అక్కడి సొసైటీ డైరెక్టర్ మేరుగు రత్నరాజు చేసిన విజ్ఞప్తి మేరకు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించి పరిశీలించారు. ఈ కల్వర్టు పునర్నిర్మాణానికి అవసరమైన ఎస్టిమేట్లు వేయాలని ఆర్అండ్‌బీ ఖమ్మం ఈఈని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. దాంతో ఈఈ ఆదేశాల మేరకు వైరా డీఈ రమేష్ సిబ్బందితో కలిసి కల్వర్టును పరిశీలించి అవసరమైన కొలతలు వేశారు. కల్వర్టు పునర్నిర్మాణం కోసం అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని డీఈ రమేష్ తెలిపారు. ఏఈ విశ్వనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రియాంకగాంధీకి బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్

మధిరటౌన్,జనవరి8(ఆంధ్రజ్యోతి): ఎంపీ ప్రియాంకగాంధీపై బీజేపీ నేత రమేష్ బిధూరి చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ నాయకులు క్షమాపణ చెప్పాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ డిమాండ్ చేశారు. బుధవారం మధిర లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిడమానూరి వంశీ, బాలరాజు, అవుల కిరణ్, జహంగీర్, డేవిడ్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, జనవరి8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి బీజేపీ క్షమాపణలు చెప్పాలని మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రమేస్ బిదూరి కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు అనుమోలు కృష్ణారావు, కడియం శ్రీనివాసరావు, పసుపులేటి నారాయణ, మల్లెల లక్ష్మణ్‌రావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమయే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బుధవారం మండలంలో పర్యటించి పాఠశాలలను పరిశీలించడంతో పాటు 45సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. రూ.12.71లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇంటింటికి వెళ్లి బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాప్రభాకర్, వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్, జిల్లా అధికార ప్రతినిధి పొట్లపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాటల పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బొర్రా రాజశేఖర్

వైరా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రవళి కళానిలయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 13న వైరాలో నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి పాటల పోటీల కరపత్రాన్ని బుధవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ ఆవిష్కరించారు. ఆట్రస్టు నిర్వాహకుడు గద్వాల రమేష్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజశేఖర్ కరపత్రాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.

ఈ పాటల పోటీలను గాయకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కాంక్షించారు. ఈ కార్యక్రమంలో టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు మచ్చా రామారావు, రేచర్ల సత్యం, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో 54మంది బైండోవర్

సత్తుపల్లిరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, పేకాట ఆడేవారు, నిర్వహించే వారు 54మందిని ఇప్పటివరకు బైండోవర్ చేసినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడిపందేలు, పేకాట ఆడేందుకు అనుమతులు లేవని, నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం రూ.లక్ష వరకు బైండోవర్ చేసి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామని చెప్పారు. అదేవిధంగా రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో వాహనదారులకు అవగాహన కల్పించామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రఘు, కవిత, వీరేందర్, ఏఎస్ఐ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

పాత సెంటర్‌లో చోరీ

పాతసెంటర్‌లోని నాగలక్ష్మి కిరాణా షాప్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఈ క్రమంలో షాపు రేకులను తొలగించి లోనికి ప్రవేశించి కొంత నగదుతో పాటు కిరాణా సామాన్లు అపహరించినట్లు బాధితుడు లబోదిబోమంటున్నారు. కాగా ఇదే విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ టీ.కిరణ్ వివరణ ఇచ్చారు.

'ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి'

కొణిజర్ల, జనవరి8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతుకూలిసంఘం జిల్లా నాయకుడు ఖాసీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ గత 15సంవత్సరాలుగా రేషన్‌కార్డులు లేక గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. గత పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వకుండ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అధికారం కోసం అనేక వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి పఠాన్‌ఖాసీంఖాన్, గరటయ్య, ఉపేందర్, లచ్చన్న, సిద్ధు, కోటమ్మ పాల్గొన్నారు.

యువత జీవితాలను దుర్భరం చేసుకోవద్దు

ఎర్రుపాలెం, జనవరి8(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను దుర్భరం చేసుకోవద్దని ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో గల సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మాదకద్రవ్యాల పై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల దురలవాటుతో విద్యార్థులు చిన్నవయస్సులోనే జీవితాన్ని పరిసమాప్తి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, డైరెక్టర్ రమేష్, అధ్యాపకులు గోపి, గద్దలసత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రతి ఒక్కరి బాధ్యత

- డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్

సత్తుపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడవచ్చునని డీసీహెచ్ఎస్ కే.రాజశేఖర్ గౌడ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోలోని గ్యారేజీ వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ సత్తుపల్లి, మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అంతకముందు సత్తుపల్లి ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిని డీసీహెచ్ఎస్ సందర్శించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ సిలివేరు సాహితీ, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, వైద్యులు డా.మట్టా సాత్విక్, డా.ఆకాష్, ఆర్టీసీ సూపర్‌వైజర్లు, ఏడీసీలు, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావుతో పాటు లయన్స్‌క్లబ్, మదర్‌థెరిస్సా కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

పెనుబల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఎన్నెస్పీ కాల్వలో పడి వ్యక్తి మృతి చెం దాడు. ఈ సంఘటన కొత్తకారాయిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన ఉల్లాస వెంకటేశ్వరరావు(58)తన వ్యవసాయ పొలానికి పక్కనే ఉన్న ఎన్నెస్పీ కాల్వ వద్దకు బుధవారం బహిర్భూమికి వెళ్లగా ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందాడు. అక్కడే ఉన్న గ్రామస్థులు కు టుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కాల్వ లో వెతకడంతో వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

సారా తయారీదారుల అరెస్టు

కల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) అక్రమంగా కాపుసారా తయారీకి పాల్పడతున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం ఎక్సైజ్ శాఖ పోలీసులు కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. కాపు సారా తయారు చేస్తున్నారని సమాచారం మేరకు సత్తుపల్లి ఎక్సైజ్ శాఖ సిబ్బంది గన్యాతండ, వాచ్యానాయక్‌తండ, చంద్యతండాలలో గాలింపు చేపట్టగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ పి. సాంబశివుడు ఎదుట నిందితులను ప్రవేశ పెట్టి బైండోవర్ చేశారు.

చికిత్స పొందుతూ బాలుడు..

పెనుబల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం కొనివ్వలేదని ఓ బాలుడు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఏరుగట్లలో జరిగింది. గ్రామానికి చెందిన సాకబోయిన ఆనంద్(17) తల్లిదండ్రులు తనకు మోటర్‌సైకిల్ కొనివ్వలేదని ఈనెల ఐదో తేదీన క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

తిరుప్పావై ప్రవచనాలు



గీతామందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా స్థానిక గీతాజ్ఞాన మందిరంలో బుధవారం అమ్మవారికి, స్వామివారికి భక్తులు మంగళహారతులతో తిరుప్పావై ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ పార్థసారథి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసినట్లు నిర్వహకులు కొత్తూరు రాజేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు గుడివాడ చక్రధర్, బాలలీలాకృష్ణ, బాలాజీ, ఏపూరి పురుషోత్తం, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, సత్యవతి, శ్రీను, లక్ష్మీ, కోటేశ్వరి, శారద, విజయ ఝాన్సీరాణి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

వైరా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరం హైస్కూల్ విద్యార్థులకు బుధవారం విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల విలువైన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చావా శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణవేణి, ఫౌండేషన్ నిర్వాహకులు పెనుగొండ ఉపేంద్రరావు, కొల్లా రాంబాబు, తాటికొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బైక్ విజేతగా రైతు ఎంపిక

తల్లాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గ్రోమోర్ రైతు సంబరాల్లో భాగంగా నిర్వహించిన ల క్కీడ్రాలో మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన అనుమోలు నర్సింహారావు అనే రైతు బులెట్ బైక్‌ను గెల్చుకున్నాడు. బుధవారం ఖమ్మంలో జరిగిన ఒక కార్యక్రమంలో రైతు దంపతులకు కంపెనీ సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, జోనల్ మేనేజర్ సజన్‌కుమార్ అందజేశారు.